

“వ్యాపారం చేసేటప్పుడు సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోగలగాలి. అప్పుడే వాడు పైకి వస్తాడు!” కొడుక్కి వ్యాపారపు మెలకువలు ఉపదేశిస్తున్నారు విశ్వనాథంగారు.

“అది కాదు, నాన్నా! మనకు ఒకటిన్నర శాతం లాభం కూడా ఉండదు. ఇక అటువంటి పార్టీకి వస్తువులు ఎందుకు సరఫరా చేయడం!” మీ కేమీ తెలియదన్నట్టుగా అన్నాడు మధు.

“నిజమేరా! మనకు వచ్చే లాభం ఒకటిన్నర శాతమే. నిజానికి ఆ పర్సంటేజ్‌కి వ్యాపారం చేసే బదులు డబ్బు బయట వడ్డీకి తిప్పుకోవచ్చు. కాని, అటువంటి పెద్ద సంస్థలతో సంబంధాలు



# బిజినెస్

## గుంటూరు గౌరీశంకర్

పెట్టుకుంటే వ్యాపార ప్రపంచంలో మన పేరు, పరపతి పెరుగుతాయి., మిగతా చిన్న కంపెనీలన్నీ మనం వెళ్లిన వెంటనే ఆర్డర్స్ ఇస్తాయి. గుర్తుంచుకో! ఒక కంపెనీకి ఎక్కువ డిస్కౌంట్ ఇచ్చి, తక్కువ లాభాలు పొందినా, మరో రకంగా మన వ్యాపారానికి అది మంచిది. అర్థమయిందా?” విడమరిచి చెప్పారు విశ్వనాథంగారు.

అర్థమయిందన్నట్టు త లూపాడు మధు.

తన భర్త కొడుక్కి వ్యాపార రహస్యాలు చెబుతుంటే వంటింట్లో నుండి కూరలు తరుక్కుంటూ వింటోంది లలితమ్మ. ఆ ఇంటి రెండో కోడలు రాగిణి అత్తకు వంటలో సహాయం చేస్తోంది.

విశ్వనాథంగారికి ఎక్స్-రే ఏజెన్సీ ఉంది. వయసు పైబడుతూండటం వల్లనైతే నేమీ, రెండో కొడుకు ఎందుకూ పనికిరాకుండా పోతాడేమో నన్న భయంవల్లనైతే నేమి, మధుకు పెళ్లి చేసి వ్యాపార బాధ్యతలు అప్పగిస్తున్నారు. ప్రస్తుతం అంతా మధు చూసుకుంటున్నా, మధ్యమధ్యలో ఆయన సలహాలు, పరపతి చాలా ఉపయోగపడుతున్నాయి. పెద్దకొడుకు మద్రాసులో ఏదో కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం విశ్వనాథం గారికి ఏ సమస్యలూ లేవు. అప్పుడప్పుడూ ఆరోగ్యం మాత్రం కొద్దిగా 'నా గురించి కూడా పట్టించుకో!' అని హెచ్చరిస్తూంటుంది.

'రేపు డాక్టర్ దగ్గరకు ఎలాగైనా వెళ్లాలి' అనుకున్నారు. సోమవారం పొద్దున్న ఆఫీసుకు వెడుతున్న కొడుకుతో, "మధూ! సాయంత్రం ఆఫీసు మూసేయగానే ఇంటికొచ్చేయ్! కాస్త డాక్టరు దగ్గరకు వెళ్దాం!" అన్నారు.

"సరే, నాన్నా! ఆరు గంటలకల్లా వచ్చేస్తాను. తయారై ఉండండి!"- స్కూటర్ తాళాలు అందుకుంటూ అన్నాడు మధు.

** ** **

"అంతా నార్మల్‌గానే ఉన్నట్టుంది. ఇంకొన్ని టెస్ట్‌లు చేయిద్దాం. మీరు నాలుగు రోజుల తరువాత రిపోర్టులు తీసుకువెళ్లవచ్చు!" అన్నాడు డాక్టర్ రమణారావు.

ఆయనకు థాంక్స్ చెప్పి, ఫీజు చెల్లించి బయటపడ్డారు తండ్రీ కొడుకు లిద్దరూ.

** ** **

"నిజంగానా డాక్టర్!" - అప్పటికి మూడవసారి మధు ఆ ప్రశ్న అడగటం. అయినా అలాంటి వార్త తెలిస్తే పేషెంట్ తాలూకు వాళ్లు ఎలా ప్రవర్తిస్తారో తెలుసు కాబట్టి, శాంతంగా సమాధానం చెప్పాడు డాక్టర్.

"అవును, మధూ! మీరు కాస్త ధైర్యంగా ఉండకపోతే మీ నాన్నగారు ఇంకా బెంబేలు పడతారు!" అనునయంగా చెప్పాడు డాక్టర్. అప్పటికైనా తన తండ్రికి 'లంగ్ కేన్సర్' అంటే నమ్మబుద్ధి కాలేదు మధుకు.

"డాక్టర్ గారూ! మీ అనుభవాన్ని శంకిస్తున్నా ననుకోకండి! రిపోర్టులు ఏమైనా తారుమారయ్యే అవకాశం ఉందేమో కదా!" కాస్త ఆశగా అడిగాడు మధు.

అతన్ని చూస్తే జాలి వేసింది రమణారావుకి. "చూడు, మధూ! ఎప్పుడో తప్ప ఇలాంటి సీరియస్ కేసులలో డాక్టర్లు అజాగ్రత్తగా వ్యాధి నిర్ధారణ చేయరు. పైగా, మీ నాన్నగారు నాకు మంచి స్నేహితులు కూడా! నేను స్వయంగా రిపోర్ట్స్ పరీక్షించి చెబుతున్నాను. అయినా నువ్వు అలా బెదిరిపోనక్కరలేదు. ఇప్పుడు కేన్సర్‌కి చికిత్స లున్నాయిగా!" అన్నారు.

"కాని ఆ చికిత్స వల్ల నాన్న మళ్లీ మామూలు మనిషి అవుతారా, డాక్టర్!" కాస్త ముందుకు వంగి అడిగాడు మధు.

ఆ ప్రశ్నకు కుర్చీలో ఇబ్బందిగా కదిలాడు డాక్టర్ రమణారావు. "మామూలు మనిషి అవడమంటే జీవితకాలాన్ని కొద్ది రోజులు పొడిగించవచ్చు. అంటే సంవత్సరం నుండి రెండు సంవత్సరాల వరకు!" అర్థం చేసుకో అన్నట్టుగా చెప్పాడు డాక్టర్.

కొద్ది సేపు ఆగి, అడిగాడు మధు - "రేడియం థెరపీకి ఎంత ఖర్చు అవవచ్చు, డాక్టర్?"

ఆ ప్రశ్న అతని నుండి ముందే ఊహించడంతో వెంటనే చెప్పాడు - "దాదాపు అన్ని ఖర్చులూ కలిపితే అరవై డెబ్బై వేలు. రేడియం థెరపీ మాత్రమే చాలదు. సపోర్టింగ్ ట్రీట్‌మెంట్ కూడా ఉండాలి."

కుర్చీలో వెనక్కి వాలాడు మధు. "అంటే సంవత్సరం బతికే మా నాన్నగారిని ఇంకో రెండు సంవత్సరాలు బతికించుకోవాలంటే దాదాపు డెబ్బై వేలవుతుందన్నమాట!" - తనలోనే గొణుక్కుంటున్నట్టు అన్నాడు. "మీరు ఈ విషయం నాన్నగారితో ..." సంశయిస్తూ అడిగాడు మధు.

"తప్పకుండా చెబుతాను. ఆయనకు వేరే విధంగా తెలియడం కంటే నా ద్వారానే తెలియడం మంచిది. అయినా ఆయన సహకారం లేనిదే చికిత్స చేయడం కష్టం!" చెప్పాడు డాక్టర్.

"సరే, డాక్టర్! చెప్పక తప్పదన్నప్పుడు నేనే సమయం చూసి చెబుతాను, వస్తాను!" కుర్చీలో నుంచి లేస్తూ అన్నాడు మధు.

షేక్‌హేండ్ ఇస్తూ, "అయామ్ రియల్లీ సారీ, మధూ!" చెప్పారు డాక్టర్.

సమాధానంగా కళ్లతోనే థాంక్స్ చెబుతూ బయట కొచ్చాడు మధు.

** ** **

"అయితే ఇప్పుడు డెబ్బై వేలు పోసి మీ నాన్నకు కేన్సర్‌కి చికిత్స చేయిస్తా నంటారు, అంతేనా!" తన మీద వేసిన చేతిని తీసిపారేస్తూ కోపంగా అంది రాగిణి.

"అది కాదు, రాణీ! ..." నచ్చ చెప్పబోతున్న భర్తను ఆపి, "సరే ట్రీట్‌మెంట్ ఇప్పిస్తాం! కానీ ఆయన మహా అయితే ఇంకో రెండో మూడో సంవత్సరాలు బతుకుతారు. దానికోసం అంత డబ్బు ఖర్చు చేయడం దండగ కదండీ!" తార్కికంగా వివరణ ఇస్తూ చెప్పింది.

"పిచ్చిదానా! మా నాన్న ఇంకో రెండు మూడు సంవత్సరాలు బతుకుతే మన బిజినెస్ ఇంకా పెరుగుతుంది. ఆయనకు మార్కెట్‌లో ఉన్న పరపతి నే నింకా సంపాదించలేదు. ఆయన పేరు చెబితేనే ఎన్నో ఆర్డర్స్ వస్తాయి. బిజినెస్‌కి కొత్త వాడైన నాకు ఆయన సలహాలు కూడా ఎంతో ఉపయోగపడతాయి. అంతేకాదు, ... " గొంతు తగ్గించి చెప్పాడు మధు.

"ఈ ఇల్లు నాన్నగారి పేరు మీద ఉంది. నేను ఇప్పుడు నాన్నకు ఇంత ఖర్చుపెట్టి వైద్యం చేయించడం వల్ల ఈ ఇంట్లో ఎక్కువ భాగం నాకు చెందేటట్లు రాస్తారు. ఇవన్నీ కలుపుకుంటే డెబ్బై వేలు ఒక లెక్కలోనిది కాదు!"

భర్త ఊసు రావడం, వెంటనే కేన్సర్ పదం వినబడడంతో చెవులు రిక్కించిన లలితమ్మ తన భర్త ఇచ్చిన వ్యాపార సలహాలను వ్యాపారంలోనే కాకుండా, మానవ సంబంధాలలో కూడా ఉపయోగించుకుంటూ వ్యాపారంలో తండ్రికన్నా ఎన్నో రెట్లు 'ఎదిగిపోయిన' కొడుకుని కన్నందుకు అక్కడే కూలబడింది.





## సుస్మితకు సోనియా కిరీటం!

*'నీలో ఒక భావి ఇందిరను చూస్తున్నాను' అన్నది ఎవరో కాదు - సోనియాగాంధీ! మరెవరితోనో కాదు - విశ్వసుందరి సుస్మితా సేన్‌తో!!*

*శ్రీమతి సోనియాగాంధీ స్వయంగా కోరారుట సుస్మితను వచ్చి కలవమని. అంతకుముందు రాష్ట్రపతి శ్రీ శంకర్ దయాళ్‌శర్మ, ప్రధాని శ్రీ పి.వి. ఆమెతో మామూలుగానే సంభాషించారు. కానీ సోనియా ఆమెతో బహు ఆప్యాయంగా మాట్లాడారుట. "ని న్నెందుకు కలవా లనుకున్నానో తెలుసా? ఇందిరాజీ మీద నీ కున్న అభిమానం గురించి చెప్పావు కదా! అందుకు! నీలో నేను భావి ఇందిరను చూస్తున్నాను" అని మరో కిరీటం పెట్టేశారుట సోనియా!*

*ఇంకేముంది?! సుస్మిత మేఘాల్లో తేలిపోతోందట ఈ కితాబుకు!*